# గజేంద్రమోక్షం

భాగవత పురాణములోని ఒక గాథ.గజేంద్రమోక్షం కథకు వెనుకవున్న తాత్త్విక అర్థం ఏమిటి? అని ఆలోచించాలి.ఈ భవబంధాలు,సిరిసంపదలు శాశ్వతంగావు–మనవెంటరావు.భార్యాబిడ్డలు, బంధువులు,స్నేహితులు వీళ్ళంతా పెడితే తింటారే కాని కష్టంలో ఆదుకోరు–మన వెంటరారు. సంసారబంధం అటువంటిదే కదా!దాని నుండి కాపాడేది సర్వేశ్వరుడేకాని ఈ పరివారము కాదు.

పూర్వం ఇంద్రద్యుమ్నుడు అను రాజు అడవిలో తపస్సు చేసుకుంటూ ఉండగా, ఒకసారి అగస్త్య మహర్షి ఆ దారివెంట వెళ్ళడం సంభవించింది.ఇంద్రద్యుమ్నుడు ఘోర తపస్సులో మునిగి ఉండడంవల్ల మహర్షి రాకను గమనించలేక పొయ్యాడు.అందులకు అగస్త్య మహర్షి కోపోద్రిక్తుడై వెయ్యేళ్ళు గజరూపం అనుభవించవలసిందిగా ఇంద్రద్యుమ్న మహారాజుని శపించాడు.తత్ఫలితంగా ఆ మహారాజు గజరూపం దాల్చాడు.ఆ ఏనుగు ఇతర ఏనుగుల మందతో కలిసి త్రికూట పర్వత ప్రాంతంలో వున్న వనంలో విహరిస్తూ ఉండేది.

త్రికూట పర్వత సానువుల్లోనే దేవలుడు అనే ముని ఆశ్రమం కూడా ఉంది.ఒకసారి 'హూహూ' అను గంధర్వుడు దేవకన్యలతో ఆశ్రమ సమీపంలోని వనంలోకి విహారానికి వచ్చాడు. అక్కడే ఉన్న ఒక కొలనులో ఆ సుందరాంగులతో నగ్నంగా జలక్రీడలాడుతున్నాడు.ఆ దృశ్యం చూసిన దేవలుడు,హూహూ అలక్ష్య ప్రవర్తన పట్ల కోపించినవాడై గంధర్వుని మొసలి రూపం దాల్చుమంటూ శపించాడు.

ఒకనాడు ఆ ఏనుగు (ఇంద్రద్యుమ్నుడు ) దాహం తీర్చుకోనడానికి గాను ఆ కొలనులో కాలు పెట్టెను.మకరం వెంటనే ఏనుగు కాలును కరచిపట్టింది.అట్లు ఇద్దరూ (ఏనుగు రూపంలో ఉన్న ఇంద్రద్యుమ్నుడు ,మకర రూపంలో ఉన్న హూహూ) కొన్ని వందల ఏళ్లు పెనుగులాడి విసిగి పోయారు.చివరకు గజేంద్రుడు దైవాన్ని ప్రార్థించగా వైకుంఠంలో ఉన్న విష్ణుమూర్తి గరుడవాహనారూఢుడై దివి నుండి భువికి ఏతెంచి తన చక్రాన్ని మొసలిపై ప్రయోగించగా ఇద్దరూ శాపం నుండి విముక్తులయిరి.